# ఉద్యోగ ధర్మం

"దేవా! దానియేలును క్షమించు. అతడేం చేశాడో అతడికే తెలీదు!"

❀ ❀ ❀

దానియేలు అంతవాడవుతాడని, తలిదండ్రులు కూడా అనుకోలేదు. ఎ.బి.సి.డి.లు నేర్పిన తరువాత, ఏడ్సు రీడరు ప్రారంభిస్తూ, ఆశీర్వాదం అన్న మాటలు, యీ నాటికీ దానియేలుకు బాగా జ్ఞాపకం.

"నీ తల్లిదండ్రుల జీవితాల్నుంచి, నువ్వు భిన్నుడవుగా బ్రతుకుతావు"

ఆశీర్వాదం ఏమాట అన్నా, బైబిలు చదువుతున్నట్టే వుండేది.

"దేవుడు నిన్ను కరుణించుగాక!" అన్నాడు ఆశీర్వాదం – తను పోలీసుగా రిక్రూటు అయేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పినప్పుడు.

నిజంగానే దానియేలును దేవుడు కరుణించాడు. ప్రథమ ప్రయత్నంలోనే పోలీసుగా రిక్రూటు చేసుకున్నారు.

తల్లిదండ్రుల జీవితమార్గం నుంచి, వృత్తిధర్మం నుంచి, కేవలం భిన్నమైన మరో కొత్తమార్గంలో అతడు కాలు పెట్టాడు.

మరియమ్మ తనకు భార్య అవుతుందని అతడు కలలో కూడా నమ్మలేదు. ఓ ఎకరం పొలం, వుద్యోగం చేస్తున్న అక్క, యిటిక గోడల యిల్లు వున్న మరియమ్మ తలిదండ్రులు, తనకు ఆమెను యిస్తారని అతడు ఏనాడూ ఆశించలేదు. చర్చిలో అతడు ప్రార్థనకు వంగినప్పుడు దేవుణ్ణి చాలా చాలా వరాలు కోరేవాడు. కాని కోరినివల్లా రెండే రెండు వరాలు. ఒకటి బొందితో స్వర్గానికి చేర్చమని – రెండు మరియమ్మను భార్యగా యిమ్మనీనూ.

కాని, తను పోలీసుగా చేరిన ఐదో నెలలో బెల్టు నడుముకు బిగించి, సొంతంగా కొనుక్కున్న సీమ బూట్లు తొడుక్కొని, కాకీ చొక్కాతో, నిక్కరుతో పల్లెలోకి ప్రవేశించిన అరగంటకల్లా అటు

నుంచి కబురు రానేవచ్చింది.

తను ఆశ్చర్యపోయాడు - తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు.

పల్లె అంతా ఆశ్చర్యపోయింది.

ఆశ్చర్యపడని వాడల్లా ఒక్క ఆశీర్వాదమే!

"దేవుడు మిమ్ము కరుణించుగాక" అన్నాడు ఆశీర్వాదం.

చర్చిలో వివాహం జరిగిపోయింది.

పదోరోజుకల్లా పోలీసులైన్‌లో మరియమ్మతో కాపరం పెట్టాడు దానియేలు అంతా సక్రమంగానే. తను అనుకున్న మాదిరిగానే, దేవుడు కరుణించిన విధంగానే జరిగిపోయింది ఓ నాలుగు నెల్లు.

దానియేలు దయా, ధర్మగుణాలు కలవాడు. ఎడమ చెంప మీద కొడితే కుడి చెంప యివ్వాలనుకునే ఉదారబుద్ధి కలవాడు. కాని ఆనాడు తనే ఎడమా కుడి చెంపల్నే కాక - ఎక్కడ బడితే అక్కడ, బెల్టుతో కనబడిన వాడినల్లా బాదవలసి వచ్చింది.

కొత్త సినిమా ఆ రోజునే ప్రారంభం. బుక్కింగు దగ్గిర జనం తోపులాట - తొక్కిసలాటగా, చివరికి దెబ్బలాటగా పరిణమించింది. తను మరిద్దరితో డ్యూటీ మీద వున్నాడు. లాఠీ తిప్పడంతో ప్రారంభమై, దాన్ని ఎవడో లాక్కుంటే నడుం బెల్టు లాగి విసరవలసి వచ్చింది. తను కళ్ళు మూసుకునే విసిరాడు. ఆ తొక్కిడిలో, గల్లంతులో, ఆ బెల్టు బకిల్ ఎవరో స్త్రీ కంటికి తగిలింది. నెత్తురు!

జనం అతడి మీదికి విరుచుకుపడ్డారు.

స్టేషన్ నుంచి ఓ లారీ నిండు రిజర్వు వచ్చి అతణ్ణి రక్షించింది.

దారిపొడుగునా, యింటికి చేరేవరకూ అతడికి ఒకటే భయం, దిగులు.

'ఆ స్త్రీ కన్ను సాంతం పోయిందేమో!'

మరియమ్మ ఓదార్చింది. 'డ్యూటీ తప్పదుగదా' అన్నది.

ఇద్దరూ సిలువ ముందు వంగి ప్రార్థించారు.

"కళ్ళు లేకపోతే, ప్రపంచమే లేదు" అన్నది మరియమ్మ.

దానియేలు తల వంచుకు వూరుకున్నాడు.

"నా ఎడమ కన్ను చూడు. ఎప్పుడో చిన్నతనంలో యింత తాటిపేదు గుచ్చుకున్నది. ఈనాటి వరకూ...."

"ఆఁ!" అంటూ అదిరిపడ్డాడు దానియేలు.

"ఇంతకాలంనుంచి నాకు చెప్పలేదేం?" అన్నాడు కోపంగా.

"నాకే గుర్తుండదు. ఈ రోజున యిది విన్న తర్వాత...."

మరియమ్మ భర్త మొహం వంక చూచి ఆగిపోయింది.

దానియేలు ఆపాదమస్తకం వణికిపోతున్నాడు. అతడి కళ్ళ ముందు ఆ సాయంత్రం తన బెల్టు దెబ్బకు గురైన స్త్రీ, పమిటచెంగుతో వచ్చే నెత్తురు ఆపుకుంటూ రోదించడం కదుల్లాడింది.

చిన్న బుడ్డి వెలుగులో అతడు భార్య కంటిని పరీక్షగా చూశాడు. ఎడమ కంటిలో నల్లని చిన్న

మచ్చ. పక్కగా ఓ చిన్న కంది బద్దలాంటి కుదప.

"ఇంతకాలంనుంచి చెప్పలేదేం?"

"నా కంట్లో ఏముందో నాకేం తెలుస్తుంది?"

మరుసటి రోజునే దానియేలు ఏవో బజారు మందులు తెచ్చాడు. నెల రోజుల కల్లా, కంటిలో చిన్నపువ్వు, విపరీతమైన తలపోటు.

ఆశీర్వాదం ఏదో పనిమీద అటువచ్చి ఆశీర్వదించాడు.

"దేవుడు మిమ్ము కరుణించుగాక! తెలిసిన డాక్టరుకు చూపించండి" అన్నాడు.

ఇద్దరు తెలిసిన డాక్టర్లు చేసిన రెండు ఆపరేషన్లతో, మరియమ్మ కన్ను గాజుకన్నుగా మారింది.

దానియేలు దిగులు పడ్డాడు.

'కొండ మీద ప్రసంగం' రోజుకు రెండుసార్లయినా చదవందే పడుకునేవాడు కాదు. తను ఎవరి భార్య కన్నో పోగొట్టాడు. తన భార్య కన్ను దేవుడు పోగొట్టాడు. దేవుడు దయామయుడు. వడ్డీతో కూడా ప్రతీకారం చేసి తీరుతాడు!

కాలం దొర్లిపోతోంది. దానియేలు హెడ్ కానిస్టేబులయాడు. తోలు పటకా, యినప బకిల్ తీసేసి, మెత్తని సిల్కు పటకా, యిత్తడి బకిల్ తగిలించాడు.

కాని మనస్సుకు శాంతి లేదు. ఎప్పుడూ ఒకటే దిగులు, ఒకే అనుమానం – దేవుడు చేసిన ఆ ప్రతీకారంతో తృప్తిపడి వూరుకుం టాడా?

ఆ రోజు తిరిగి తను అసహ్యించుకునే, భయపడే డ్యూటీకే వెళ్ళవలసి వచ్చింది. హస్తిమల్ యిచ్చే కోటా గుడ్డకు వచ్చే జనాన్ని అదుపులో వుంచాలి.

సరిగ్గా తను వాకిలి దాటబోయే సమయానికి, మరియమ్మ వెనక నుంచి కేక వేసింది.

అపశకునం అనుకుంటూ దానియేలు నిలబడ్డాడు.

"కోటా గుడ్డలు యిస్తున్నారంట!"

"అక్కడికే వెళ్తున్నాను"

"దొరికితే పది గజాలు – లేకపోతే ఐదు గజాలైనా మల్లు కావాలి"

దానియేలు విసుక్కున్నాడు. గడప యివతలికి వచ్చి నిలబడ్డాడు.

"మనకు వేరే కోటా యిస్తారు. అక్కడ లాభం లేదు"

మరియమ్మ బతిమాలుతున్న ధోరణిలో, గడప నానుకుని అన్నది –

"మనకు మల్లు యివ్వరు. రోజూ కూరగాయలు తెచ్చే వెంకమ్మ కార్డు యిచ్చింది. రవికలకు కావాలి"

దానియేలు గుండెలు వేగంగా కొట్టుకున్నయ్. ఏవేవో దృశ్యాలు మనస్సులో మెదిలినై. జనం తొక్కిసలాట – లాఠీలూ బెల్టులూ విసరవలసి రావొచ్చు. ఏం జరగబోతోందో!!

"నేను తెచ్చే వీలులేదు. నువ్వు రావొద్దు"

మరియమ్మ జవాబు వినకుండానే చకచకా నడిచాడు. ఏవో భూతం, సైతాన్‌లు వెన్నంటి

వస్తున్నట్టు తత్తరపడ్డాడు.

అతడి భయం నిజమే అయింది.

హస్తిమల్ కొట్టుకు ఓ అరఫర్లాంగు యిటూ అటూ, కదిలేందుక్కూడా ఖాళీ లేనంతగా జనం.

'దేవా! ఏ పాపం జరక్కుండా చూడు' అని ప్రార్థించాడు దానియేలు.

కొట్టు తలుపు చెక్కల్ని ఒక్కదాన్ని మాత్రం తీయించి, అడ్డంగా నుంచున్నాడు.

"తోసుకోవటం, తొక్కోవటంవల్ల లాభం లేదు. ఒక్కొక్కళ్లేరండి. ముందు ఆడవాళ్ళకు...."

మాట పూర్తికాకుండానే పెద్ద కేకలు. జనం తోపులాట, తొక్కిసలాట.

దానియేలు వళ్లు మండింది. మనస్సు నిండుగా మైకం కప్పింది.

ఒక్క గుంజుతో నడుం బెల్టు చేతిలోకి వచ్చింది. పక్కనవున్న యిద్దరు పోలీసుల్తో,"కొట్టండి! వెనక్కు నెట్టండి!" అంటూ బెల్టును ఎడాపెడా కళ్లు మూసుకుని విసర సాగాడు.

"అయ్యో! నా కన్ను!" అన్న స్త్రీ రోదన ధ్వని.

అతడు కళ్లు తెరిచాడు. కాళ్ళల్లో పట్టు సడలింది. కళ్లు బైర్లు కమ్మినై.

తిరిగి లారీ నిండుగా రిజర్వు పోలీసులు!

అరగంట తరవాత, కలలో నడుస్తున్నవాడిలా, తెలిసీ తెలియని మైకంలో, దానియేలు యింటికి నడిచాడు.

వాకిటి ముందు ఓ చిన్నగుంపు. లోపల ఐదారుగురు మనుషులు. అతడు వాళ్ళెవర్నీ గమనించకుండానే, సరాసరి లోపలికి వెళ్లి, బెల్టు వూడదీసి ఓ మూలకు విసిరాడు.

"దేవుడు మిమ్మ కరుణించుగాక" - ఆశీర్వాదం ఆశీర్వదించి అతడి భుజం మీద చేయి వేశాడు.

దానియేలు తెల్లబోయి చూశాడు.

"భయపడకు! డాక్టరుకు కబురుపోయింది"

"ఎవరి కోసం? ఎందుకు?" అతడి గొంతులో రోదన ధ్వని.

"మరియమ్మ! నీ స్త్రీ! కంటిమీద బెల్టు దెబ్బ తగిలింది. బకిల్ బాగా కంట్లో దిగింది"

"ఏ కన్ను! ఏ కన్ను!" - దానియేలు కంపిత స్వరంతో అంటూ భార్య పక్కన కూర్చుని, తల తన వైపుకు తిప్పుకున్నాడు.

"ఎడమ కన్ను శల్యం లేనిది! కుడికన్ను...దేవుడు...."

దానియేలు జుగుప్సతో వెనక్కు తిరిగి చూశాడు.

ఆశీర్వాదం కుడిచేయి ఎత్తి ఆశీర్వదిస్తున్నాడు.

తను విసిరి దూరంగా పారవేసిన బెల్టు గది మూల తాచుపాములా మెలికలు తిరుగుతూ, పాలీష్ అయిన యిత్తడి తళ తళల్లో తల తిప్పుతోంది.

❋

*(ప్రచురణ : 1940–49 మధ్య)*